
శబ్దం లేకుండా తలుపు తెరుచుకుంది. బెడ్‌రూములోకి అడుగుపెట్టిన శ్రీధర్ ఒక్క నిముషం అలాగే నిలబడిపోయాడు. అతని చూపులు తెల్లని పడకపైన, ఒక చెయ్యి మడిచి తలక్రింద ఆధారంగా పెట్టుకునీ, రసమయ భంగిమలో వార పత్రిక చదువుకుంటూ పడుకున్న విజయమీద నిలిచిపోయాయి.

పల్చటి ఆర్గండి చీరలో, ఆమె అందం మరింత ఇనుమడిస్తుంది.

శ్రీధర్ మనస్సు బాధగా మూలిగింది. వారం రోజులక్రితం వరకూ అతన్ని చూడగానే, ఆమె చూపులు మత్తుగా ఆహ్వానం పలికేవి. ఆమె అధరాలు రాగ రంజితమయి తళుకులీనేవి.

భార్యా భర్తల మధ్య పరస్పరానుకూలత, అవగాహనం ఉంటేనే దాంపత్య జీవితం సాఫీగా సాగిపోయేది. ఎంత అన్యోన్యంగా ఉండే భార్యాభర్తలమధ్య అయినా, ఒక్కోసారి అభిప్రాయ భేదాలు రావటం సహజం.




శ్రీధర్‌కూ, విజయకూ పెళ్ళి జరిగి సంవత్సరమయింది. సుఖంగా, సంతోషంగా గడిపేవాళ్ళ మధ్య వారం రోజులక్రితం చిన్న విషయంమీద, తగువొచ్చింది. శ్రీధర్ ఆ విషయాన్ని సాయంత్రానికల్లా మరిచిపోయి, ఆఫీసునుంచి వస్తూ విజయకు మల్లెపూలు కొని తెచ్చాడు.

కోపం తగ్గని విజయ, ఆరాత్రి ఎంతో ప్రేమగా, అనురాగంగా మల్లెలమాలను తలలో తురమబోతున్న శ్రీధర్ చేతుల్లోనుంచి, ఆ మాలను విసురుగా లాక్కుని, అతని ముఖంమీద విసిరికొట్టి అతనికి దూరంగా చాప పరుచుకుని పడుకుంది.

సున్నితమయిన శ్రీధర్ మనస్సు, విజయ చర్యకు చాలా బాధపడింది. ఆమెగా, తనకు చేరువయ్యే వరకూ విజయతో మాట్లాడకూడ దనుకున్నాడు. వారం రోజులు గడిచిపోయాయి. వాళ్ళమధ్య రాజీ కుదరలేదు–

శ్రీధర్‌వైపు చూసిన విజయ ముఖం తిప్పుకుంది. ఆమె నిర్లక్ష్యాన్ని భరించలేకపోయాడు. బయటకొచ్చి పూల మొక్కలమధ్య గార్డెన్ ఛెయిర్‌లో కూర్చున్నాడు. వారం రోజుల క్రితం జరిగిన విషయం అతని మనస్సులో మెదిలింది.

★ ★ ★ ★

ఆఫీసు కెళ్ళబోతున్న శ్రీధర్ దగ్గరకొచ్చి, "నాకో రెండొందలు కావాలి". అంది విజయ.

"రెండొందలా? ఎందుకు?"

"కారణం చెప్పంది ఇవ్వరా? నేను కాపురానికొచ్చిన ఈ సంవత్సరంలో, కారణం అడగకుండా నాకెప్పుడయినా డబ్బిచ్చారా?" అంది విజయ కోపంగా.

"ఎందుకలా ఆవేశపడతావు? నెలాఖరుకదా. నా దగ్గరంత డబ్బు లేదు. అర్జంటుగా కావాలేమో అనుకుని కారణం అడిగాను."

"మీ సంగతి నాకు తెల్సు. నెలంతా నేను సంపాదించి తెస్తున్న డబ్బు, ఈవిడగారు మంచి నీళ్ళలా ఖర్చు చేస్తుందని మీ అభిప్రాయం. అందుకే, నేను పాతిక రూపాయలు కావాలని అడిగినా, వెంటనే ఎందుకు అనడుగుతారు."

"విజయా! నా మనస్సు నర్థం చేసుకోకుండా మాట్లాడతావు. నేను సంపాదించేది ఎవరికోసం. నీకోసం కాదా?"

"అలా అనుకుని తృప్తిపడాలి నేను అంతే. ఒక చీర కొనుక్కుందామంటే మిమ్మల్నడగాలి. సినిమా కెళ్ళాలంటే మీ పర్మిషన్ తీసుకోవాలి. అంతెందుకు ఇల్లు కదిలి, వీధిలో కెళ్ళాలంటే మీ అనుమతి కావాలి. పంజరంలో చిలకలా, స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లేకుండా మీకు బానిసలా ఇలా బ్రతకటంకంటే, గౌరవంగా ఆత్మహత్య చేసుకుని చావటం మంచిది."

"విజయా!" ఖంగుమంది శ్రీధర్ గొంతు.

"ఏం? ఎందుకలా అరుస్తారు? భార్యంటే, మీ దృష్టిలో ఖర్చులేని పని మనిషి. మీకూ, మీ ఇంటికి, రేపు మీకు పుట్టబోయే పిల్లలకూ చాకిరీ చేస్తుంటే, తిండి పెటి పోషిస్తారు. ఆ చాకరీ చెయ్యని రోజున అది పెట్టరేమో."

"నువ్వేం మాట్లాడుతున్నావో, నీకు తెలిసే మాట్లాడుతున్నావా?"

"ఏం? నాకు మతి పోయిందనుకుంటున్నారా?"

" నీ భర్తకు వండి పెట్టటం, నీ ఇంటిని నువ్వు చక్కదిద్దుకోవటం చాకిరీ అనుకుని బాధ పడుతున్నావంటే నువ్వు చదువుకున్న మూర్ఖురాలివి."

"మూర్ఖురాలిని కాబట్టే, ఇలా పంజరంలోని చిలకలా బ్రతుకుతున్నాను."

విజయ ప్రతిసారి అదే మాటంటుటే, చికాకని పించింది శ్రీధర్‌కు. పళ్ళబిగువున కోపాన్ని అదిమిపడుతూ "ఇలా చిలకలా బ్రతకటం నీ కిష్టం లేకపోతే స్వేచ్ఛగా ఎక్కడికయినా ఎగిరిపోవచ్చు."

"అంటే, నన్ను మా పుట్టింటికి పొమ్మనేగా? అర్థం? మా పుట్టింటివాళ్ళేం నన్ను పోషించలేని స్థితిలో లేరు. నేను వెళ్లాలే గాని, మహారాణిలా చూసుకుంటారు. మీ అజ్ఞలను శిరసావహిస్తూ, మీ శాసనాలకు తలవంచుతూ ఇలా బ్రతికేకంటే వెళ్ళిపోవటమే మంచిది" అంది కోపంగా.

"గెటవుట్. ఐ సే యూ ఫస్ట్ గెటవుట్" అంటూ కోపంగా అరిచాడు శ్రీధర్. తర్వాత, భార్యతో మాట్లాడటం కూడా ఇష్టం లేనట్టుగా బయటకు వెళ్ళిపోయాడు.

ఆఫీసయిపోయి ఇంటికి బయలుదేరే సమయానికి శ్రీధర్ కోపం ఎగిరిపోయింది. మల్లెపూలు కొని తెచ్చి విజయకోపం పోగొట్టాలని, తనే స్వయంగా ఆమె తలలో తురమబోతే, ఆ పూలమాలను విసురుగా అతని ముఖానికేసి కొట్టింది. అర్థంలేని ఆమె కోపానికి శ్రీధర్ క్కూడా కోపం వచ్చి ఆమెతో మాట్లాడటం మానేసాడు.

★ ★ ★ ★

చివరంటా కాలిన సిగరెట్, వేళ్ళను చురుక్కుమనిపించటంతో, గతంలో నుంచి తేరుకున్నాడు శ్రీధర్.

ఎంతకీ భర్త బెడ్‌రూమ్‌లోకి రాకపోయేసరికి బయటకొచ్చి చూసింది విజయ. కుర్చీలో వెనక్కువాలి పడుకున్న శ్రీధర్ కనిపించేసరికి ఒక్కసారిగా అవ్యాజమయిన ప్రేమానురాగాలు పొంగాయి ఆమె మనస్సులో. ఆ భావనలు ఒక్క నిముషం మాత్రమే. అంతలోనే అతనన్న "గెటవుట్" అన్న మాట గుర్తుకొచ్చి విసురుగా మళ్ళీ బెడ్‌రూమ్‌లో కెళ్ళి పడుకుంది.

ఎదురింట్లోకి కొత్తగా అద్దెకు దిగిన శిరీషా వాళ్ళు గుర్తుకొచ్చారు. శిరీష భర్త రిప్రజెంటేటివ్. శిరీషకు

# ఇల్లాలి స్వర్గం

## ఎన్. భారతీ దేవి

డిగ్రీ వున్నా, ఉద్యోగం చెయ్యటం ఇష్టంలేక చెయ్యటం లేదంట! చక్కగా ప్రతి సాయంత్రం, వాళ్ళ బాబునూ, పాపనూ తీసుకుని సినిమాకో, షికారుకో వెళుతుంది తరుచుగా షాపింగ్ కెళుతుంది. తనకు కావాలనుకున్నవి కొనుక్కుంటుంది. దేనికి భర్త పర్మిషన్ అక్కరలేదు పూర్తిగా స్వేచ్ఛాజీవి. తన భర్తకూ శిరీష భర్త కంటె ఎక్కువ జీతం వస్తుంది అయినా, తానామెలా భర్తకు తెలియకుండా ఒక్క రూపాయి ఖర్చు చెయ్యలేదు. ఒక్కచోటకు వెళ్ళలేదు శిరీషను చూసింతర్వాతనే, తను పెళ్ళయిం తర్వాత కోల్పోయిందేమిటో తెలిసొచ్చింది ఏది లేకపోయినా బ్రతకొచ్చు గానీ, స్వేచ్ఛ కరువయితే మాత్రం బ్రతకలేరు. గాఢంగా నిట్టూర్పుతూ నిద్రపోయే ప్రయత్నంలో కళ్ళు మూసుకుంది.

★ ★ ★ ★

సాయంత్రం అయిదు గంట లయింది ఎంత వేడిమికి తలలు వాల్చిన పూల చెట్లు చల్లగాలికి సేద తీర్చుకుంటూ పరిమళాలు వెదజల్లుతున్నాయి పూలచుట్టూ మకరందం కోసం తిరుగుతున్న తుమ్మెదలను చూస్తూ కూర్చుంది విజయ. ఎదురింటి శిరీష రావటం, ఆ సమయంలో విజయ కెంతో సంతోషమనిపించింది ఆప్యాయంగాఆహ్వానించింది శిరీష వద్దన్నా వినకుండా, ఆమెచేత బలవంతంగా టిఫిన్ తినిపించింది. ఇద్దరూ టీ తాగుతూ కబుర్లలో పడ్డారు.

"మిమ్మల్ని చూస్తుంటే, మీ అదృష్టానికి నిజంగా సంతోషమనిపిస్తుంది స్నేహితురాలిగా" నాకు అంది విజయ.

"బావుంది. నన్ను గురించి నేను బాధ పడని రోజంటూ లేదు" అంది శిరీష నవ్వుతూ.



# ఇల్లాలి స్వర్గం

"బాధా? మీకా?" అంది విజయ ఆశ్చర్యంగా

'ఎందుకలా ఆశ్చర్యపోతున్నారు?' అంది శిరీష

ముత్యాల్లాంటి చక్కని ఇద్దరు పిల్లలు మీకు తగిన భర్త అన్నిటికి మించి హాయిగా, సమయాన్ని మీ కిష్టమయిన పద్ధతిలో గడపటానికి తగినంత స్వేచ్ఛ ఇంతకంటె ఆడదాని కింకేం కావాలి?

"అంతే కాదండీ పుట్టినింటికి మించి ఆడదానికి ప్రతి రోజూ భర్త అనురాగం, ప్రేమా లాలన కూడా కావాలి ఉదాహరణకు నన్నే తీసుకోండి మా అమ్మా నాన్నకు నే నొక్కతెనే కూతుర్ని దాదాపు నాలుగయిదు లక్షల ఆస్తి ఉంది

అంత ఆస్తి ఉన్నా, ఉద్యోగం పురుషలక్షణం అంటూ మావారు నామాట వినకుండా, రిప్రజెంటేటివ్‌గా ఉద్యోగం చేస్తున్నారు. నెలలో ఆయన ఇరవయ్యి రోజులు క్యాంపులోనే ఉంటారు ఆయనకు దూరంగా ఒంటరిగా ఉండలేక, కాలక్షేపం కోసం బయటకు వెళితే, ఒంటరిగా కనిపించే నన్ను చూసి వెకిలిగా నవ్వేది ఒకరయితే, మాటల బాణాలు విసురుతూ వెర్రిగా చూసేది ఇంకొకరు ఆ బాధ భరించలేక షికారు కెళ్ళటం మానుకున్నాను మరి ఒంటరితనం భరించలేకపోయిన రోజు పిల్లల్ని తీసుకుని సినిమా కెళుతున్నాను మా వారింట్లో ఉంటే, బజారు పనులన్నీ ఆయనే చేస్తారు ఆయన లేకపోతే, ఆ పనులక్కూడా నేనే బయలు దేరాలి. ఇంట్లో నుంచి బయట కెళ్ళాలంటేనే నాకు తగని చిరాకు'

"అదేమిటండీ మీలాంటి స్వేచ్ఛ నాకు లేదని ఈమధ్య మా వారితో కూడా గొడవ పెట్టుకున్నాను నేను" అంది విజయ

'అసలు స్వేచ్ఛ అంటె ఏమిటి మీ దృష్టిలో" మీరే కాదు. చాలామంది ఆడవాళ్ళు మాకు స్వేచ్ఛ లేదంటూ వాపోతుంటారు విజయగారూ! మనకు భర్తలు సంపాదించి తెచ్చి పెడుతుంటే, మనకు ఇష్టమయిన వంటకాలు మనం వండుకుంటున్నాం మనింటిని మనిష్టమయిన రీతిగా అలంకరించు కుంటున్నాం నా భర్త, నా పిల్లలు, నా ఇల్లు అనుకుంటూ తృప్తిగా గడపుతున్నాం ఇంతకంటె స్వేచ్ఛ ఆడదాని కింకేం కావాలి? భర్త రక్షణ లేకపోతే, ఈ సమాజంలో, ఆడదాన్ని ఒంటరిగా బ్రతకనిస్తారా?"

'మా వారిని పంచ రూపాయలు కావాలని అడిగితే చాలు ఎందుకు? అని అడగకుండా ఇవ్వరు అదే నాకు చాలా బాధనిపిస్తుంది.

కారణం అడిగితే తప్పేముంది? క్రమబద్ధంగా, వాడకపోతే, జీతం చాలక అప్పులు చెయ్యాల్సి వస్తుంది అందుకే అలా అడుగుతుంటారు. డబ్బు మీవారు వాడతారేమో అందుకే నెలంతా అప్పుచెయ్యకుండా గడపటానికి, మీరు చెయ్యబోయే ఖర్చు అవసరమా? అనవసరమా? అని తెల్సుకోవ టానికి అలా అడుగుతారేమో? అయినా, ఎందుకు అని అడగకుండా డబ్బివ్వరని మీరు బాధ పడుతున్నానంటుంటే, నాకు చాలా ఆశ్చర్యమని పిస్తుంది మీరు ఖర్చు పెట్టినా మీ డబ్బే. మీరు ఖర్చు చెయ్యకుండా మీ వారి జేబులో దాచినా అది మీ డబ్బేగా?

నెలకు ఎంత సంపాదించే మగాడయినా, చేతికి వాచీ, పదిజతల బట్టలు అంతేగా మగాడికి కావలసింది. అతను సంపాదించేది తన భార్య కోసం, తన పిల్లల కోసం. అలాగే భార్య రోజంతా శ్రమపడేది. తన భర్త కోసం, తన పిల్ల కోసం. భార్యా భర్తల మధ్య సరైన అవగాహన లేకపోతేనే గొడవ లొస్తాయి " అంది శిరీష నవ్వుతూ.

ఇంతలో కాన్వెంటు నుంచి తన పిల్లలు రావటంతో శిరీష వెళ్ళిపోయింది. ఆమె మాటలే, మనసులో మారు మ్రోగుతుంటే, చాలాసేపు ఆలోచించింది విజయ

శిరీష మాటల్లో ఎంతో నిజముందనిపించింది. తనమూలంగా, తనభర్త అప్పుచేసినా ఆ ఆర్థిక ఇబ్బందుల్ని ఇద్దరూ కల్సే అనుభవించాలి. పొదుపుగా ఖర్చు చెయ్యకుండా దాచినా, రేపు మాకు పుట్టబోయే పిల్లలకూ, వాళ్ళ చదువులకూ ఉపయోగపడుతుంది. అమ్మో నాకు స్వేచ్ఛ లేదనుకుని బాధపడుతున్నాను. శిరీష చెబుతుంటే ఆ స్వేచ్ఛకంటే, ఈ రక్షణే నయమనిపిస్తుంది అనుకుంది. మనస్సులో నుంచి బరువు తొలగి పోయింది.

లేచి స్నానంచేసి, అందంగా ముస్తాబయింది. భర్త కిష్టమయిన ఆరంజికలర్ షిఫాన్ చీర కట్టుకుంది. దొడ్లో పూచిన జాజులు మాలకట్టుకుని తలనిండుగా పెట్టుకుంది. భర్త కోసం ఆతృతగా ఎదురుచూస్తూ కూర్చుంది విజయ.

శ్రీధర్ ఆ రోజు ఆఫీసు నుంచి రావటమే ఆలస్యంగావచ్చాడు. స్వయంగా దగ్గరుండి అంతకు ముందులా వడ్డించింది. విజయ అలంకరణ చూసి, తనలో తను నవ్వుకున్నాడు.

శ్రీధర్ పుస్తకం చదువుకుంటూ పడుకున్నాడు విసురుగా, అతని చేతిలోని పుస్తకాన్నిలాగి టీపాయ్‌మీద పడేసి, అతనికి దగ్గరగా జరిగింది. అతని తలను, ఆప్యాయంగా గుండెలకు హత్తుకుని సున్నితంగా ముద్దుపెట్టుకుంది.

శ్రీధర్ పసివానిలా, ఆమె గుండెల్లో ఒదిగి పోయాడు.

ఈ వారం రోజుల నుంచి, దాచుకున్న ఊసులన్నీ ప్రేమతో రంగరించి శ్రీధర్‌కు నివేదించింది విజయ. ఆప్యాయతా, అనురాగం, ప్రేమా, లాలన చూపుతూ ఆర్తిగా ఆమెను గుండెల కదుముకున్నాడు శ్రీధర్

అలసిపోయిన విజయ, అతని ఛాతీమీద తలపెట్టుకుని పడుకుంది. ప్రేమగా ఆమె ముంగురులు నిమురుతూ "విజయా! కోపం పోయిందా?" అడిగాడు మృదువుగా.

"ఆ విషయం నాకు గుర్తు చెయొద్దు. జరిగింది తలుచుకుంటేనే, నా మీద నాకే అసహ్యంగా ఉంది' అంది అతని గుండెలకు మరింత గాఢంగా హత్తుకుపోతూ.

"ఒక్కసారిగా, నీలో ఇంతమార్పు ఎలావచ్చింది నీ కోపం పోవటానికి ఇంకో వారమయినా పడుతుందనుకున్నాను." అన్నాడు నవ్వుతూ శ్రీధర్.

"చూడండి. నాకు మీ ప్రేమానురాగాలు తప్ప, ఇంకెలాంటి స్వేచ్ఛ అక్కరలేదు." అంది నిండు మనస్సుతో విజయ

"నిజంగా?" అన్నాడు శ్రీధర్ ఆనందంగా

"నిజమండీ! స్వర్గం అంటే ఎక్కడో లేదు ఇక్కడే మనమధ్యే ఉన్నట్టుంది నాకు. ఈ స్వర్గం తప్ప మీ నుంచి ఇంకెప్పుడూ ఏమీ కోరను "

విజయ మాటలు వినగానే పన్నీటి జల్లు కురిసినట్లు ఎగసిపడింది శ్రీధర్ హృదయం పరవశంతో ... □

